# ఓ అమ్మ కల

**పుత్రరత్నం తనను గర్భదారిద్ర్యంలో దిక్కులేని అనాథలా వదలివేసినా ఆ కన్నతల్లి మనసు ప్రేమామృతభాండమే**

అక్కమ్మకు రాత్రంతా కంటి మీద కునుకు లేదు. ఏవేవో కలలు, ఊహలు - ఆనందం.

తెల్లారితే తన కన్నుకు చికిత్స జరిగి, కంటికున్న శుక్లం తొలగిస్తారు. ఆ తర్వాత చూపు వస్తుంది.

అప్పుడు జామచెట్టు మీద వాలే పిచ్చుకలు, చిలుకలు, గోరింకలు చూడవచ్చు. మనుషుల మొహాలు స్పష్టంగా కనపడతాయి. ఆధ్యాత్మ రామాయణంలోని అక్షరాలు స్పష్టంగా చూసి చదవొచ్చు. అంతేగాదు, బియ్యంలో రాళ్ళు, తిరగమోత గింజల్లో దుమ్ము, ధూళి అన్నీ స్వయంగా ఏరుకోవచ్చు. వంట చేసేప్పుడు, కూర, పప్పు, అన్నం అన్నీ సరిగ్గా వేగాయో, ఉడికాయో, లేదో గమనించవచ్చు.

తనకు కొత్త చూపు వస్తుంది. ఎన్నో ఏళ్ళుగా, మసకగా కనుపించే ప్రకృతి, పదార్థాలు, వస్తువులు, మనుషులు, బొమ్మలు, సంజ్ఞలు అన్నీ నిర్దుష్టంగా కనపడతాయి. తాను అన్నీ చూడగలుగుతుంది.

అక్కమ్మ, పాల వ్యాను మోతకే నిద్ర లేచింది. అస్పష్టంగా గోచరించిన అమర లింగేశ్వరస్వామి గోపురానికి నమస్కరించింది. పానకపు బిందె, పాత చీర తీసుకుని కృష్ణానదికి వెళ్ళి స్నానం చేసింది. రేవులో పడవలు, చింతచెట్లు, వాటికి వేలాడే కబోది పక్షులు, లంకల్లో ఎగిరే కొంగలు, తూర్పున ఎర్రబారే ఆకాశం అన్నీ ఊహించుకుని మురిసిపోయింది.

చీర పిండుకుని, పానకపుబిందెతో నీళ్ళు ముంచుకుని, గోవింద నామాలు పఠించుకుంటూ, పూజారి బజారు గుండా వెళ్ళి గణపతి దేవాలయం ముందు ఓ క్షణం నిలబడి, కళ్ళు మూసుకుని, త్వరత్వరగా ఇల్లుచేరింది.

ఏడు గంటలకల్లా తయారుగా ఉండమని సూర్యంబాబు చెప్పాడు. ఆయన కబురంపే సమయానికి సిద్ధంగా ఉండాలి.

ధర్మప్రభువు - సూర్యంబాబు. ఏనాటి ఋణానుబంధమో, అక్కమ్మకు ఆశ్రయం, ఆదరువు కల్పించాడు. అక్కమ్మను ఏనాడూ వంటమనిషిగా చూడలేదు. తల్లి, తోబుట్టువులాగా ఆదరించాడు. అడగకుండా మంచిచెడ్డలు విచారించేవాడు.

అందుకే అక్కమ్మకు సూర్యంబాబు ప్రత్యక్షదైవం. ఉభయ సంధ్యలా ఆయన, ఆయన కుటుంబం క్షేమంగా ఉండాలని, తాను మంచాన పడకుండా ఆయన చేతుల మీదుగా దాటిపోవాలనీ మనసా భగవంతుడిని ప్రార్థిస్తుంటుంది.

ఉతికిన చీర కట్టుకుని, ఏనాటిదో పాత సిల్క్ జాకెట్, చాలారోజుల తర్వాత వేసుకుని వీధి వాకిట్లో కూర్చుంది అక్కమ్మ.

అప్పటికి సూర్యుడు బారెడు ముందుకు సాగాడు. ఊరంతా నిద్రలోంచి లేచింది.

అక్కమ్మ, సూర్యంబాబు పిలుపు కోసం ఆత్రుతగా ఎదురుచూస్తూ కూర్చుంది, వీధి వేపు క్షణానికోసారి చూస్తూ.

అక్కమ్మకు నిరీక్షణ కొత్తేమీ కాదు. ఊహ వచ్చినప్పటినుంచీ అన్నిటికీ ఎదురుచూడడం ఆమెకు అలవాటు. చిన్ననాట కొత్తగుడ్డల కోసం, బడిలో చేరినప్పుడు కొత్త పుస్తకాల కోసం ఆ తర్వాత మంచి తిండి కోసం - ఇలా కొన్నాళ్ళు గడిచాక, రాబొయ్యే భర్త కోసం ఎదురు చూడడం, కళ్ళు కాయలు కాచేలా చూడడం ఆమె జీవితంలో నిత్యకృత్యమైంది.

డెబ్బై ఏళ్ళ జీవితంలో ఆనందం, పులకరించే మధురస్మృతులు ఏమీ లేవు. అయినా, అక్కమ్మకు నిరాశానిస్పృహలు లేవు. జీవితాన్ని ఉన్నంతలో అనుభవించడం నేర్చుకుంది. అది ఆమె జీవితం నేర్పిన పాఠం.

ఇలా గతాన్ని నెమరువేసుకుంటూ వీధివేపు చూస్తూ కూర్చున్న అక్కమ్మకు సూర్యంబాబు నుంచి పిలుపు వచ్చింది.

"అమ్మగారూ, ఇయ్యాల కంటి ఆపరేషను లేదంట. అయ్యగారు మిమ్మల్ని అరిజెంటుగా వంటకు రమ్మన్నారు" అని రిక్షా గురవయ్య స్కూలు పిల్లల్ని తీసుకెడుతూ చెప్పి వెళ్ళాడు.

ఆ వార్త అక్కమ్మను అవాక్కు చేసింది.

ఏమైంది? ఎందుకు కంటి ఆపరేషను జరగదు?

తడారిన జుత్తు ముడి వేసుకుని, ఇంటికి తాళం వేసి, ఓగుడాకు గాలికి తేలిపోతున్నట్లు ఆదరాబాదరా సూర్యంబాబు ఇంటికి పరుగులాంటి నడకతో వెళ్ళింది.

సూర్యంబాబు, "రామ్మా! వీడు నా మిత్రుడి కొడుకు. అమెరికా నుంచి వచ్చాడు. ఓ వారం ఉంటాడు. వాడు మన వంటకాలు తినాలనీ, మన ఊరు, వాళ్ళ నాన్న పుట్టిన ఊరు చూడాలని వచ్చాడు. కనుక నువ్వు కంటి ఆపరేషను చేయించుకుంటే ఇబ్బంది అవుతుంది. చూడమ్మా. ఈ వారం రోజులూ వీడికి రకరకాల పిండివంటలు వండాలి. వాడు వెళ్ళగానే నీ కన్ను ఆపరేషను చేయిస్తా. ఏమ్మా" అన్నాడు.

అక్కమ్మ ఆ వచ్చిన కుర్రాణ్ణి చూసింది. బలిసిన సీమపందిలా ఉన్నాడు.

సూర్యంబాబే చెప్పాడు.

"ఈవిడ అక్కమ్మగారు. చేసేది బతుకుతెరువు కోసం వంట పని. కానీ, ఈవిడే మాకు అన్నీ. ఆవిడ చేతి వంట తినడం ఓ అనుభూతిరా నాయనా."

అక్కమ్మ ఆ పొగడ్తకు మరోసారైతే పొంగిపొయ్యేది వినమ్రంగా.

'ఏదో మీ అభిమానం బాబూ! నేచేస్తున్నదేముంది? ఈ మాత్రం వంట ఏ ఆడదైనా చెయ్యగలదు' అనేదే.

ఇప్పుడు ఏం మాట్లాడలేదు. కంటి ఆపరేషను జరగడం లేదన్న బాధ, సీమపందిలాంటి వాడికి, ఎలా వంట చెయ్యాలి, ఏ వంటకాలు చేసి, వాడికి తినిపించాలి, సూర్యంబాబుకు మాట రాకుండా ఎలా తన ప్రజ్ఞ చూపించాలీ అన్న మీమాంసలో ఉండిపోయింది అక్కమ్మ.

సూర్యంబాబు భార్య జబ్బుమనిషి. ఆవిడ సలహాలు ఇస్తుంది తప్ప ఏం పనీ చెయ్యదు. ఆడపిల్లలు, మగపిల్లలు, మనుమలు, మనుమరాండ్రు కాక వచ్చేపొయ్యే జనంతో సూర్యంబాబు ఇల్లు ఓ ధర్మసత్రంలా ఉంటుంది. కనుక ఇంతమందికీ టిఫిన్లు, భోజనాలు వండడం అక్కమ్మకు అలవాటే.

చకచకా వంట పనిలో దిగిన అక్కమ్మ, ఏ పని చేస్తున్నా ఆ బలిసిన సీమపందిలాంటి కుర్రాడే కళ్ళ ముందు మెదలసాగాడు.

ఏం తిని ఇంత లావు అయ్యాడో. లేక తల్లితండ్రుల నుంచి వారసత్వంగా ఆ ఒళ్ళు వచ్చిందో - ఎంత పుష్టిగా, బలంగా, తెల్ల జాంపండులా ఉన్నాడో అని ఆశ్చర్యపోయింది.

అక్కమ్మకు తన బిడ్డ జ్ఞాపకం వచ్చాడు.

అక్కమ్మకు ఇరవయ్యో ఏట ఓ కొడుకు పుట్టాడు. పుట్టినవాడు అర్భకపు వెధవ. సన్నగా, నల్లగా, వడలిన కరివేపాకులా ఉండేవాడు. ఏడిస్తేతప్ప ఆ శరీరంలో ప్రాణం ఉన్నట్లు తెలిసేది కాదు. కడుపు చించుకు పుట్టాడు. రక్త సంబంధం, ప్రేమ, అనురాగం తప్ప, అక్కమ్మకు ఆ పుట్టినవాడి మీద అమితంగా ప్రేమ, అనురాగం ఏమీ ఉండేవి కావు.

కానీ, అక్కమ్మ భర్త మార్కండేయులు నలభయ్యేళ్ళ వయసులో తండ్రి అయిన కారణంగా వాడిని అపురూపంగా, ప్రేమించి, గారాబం చేసేవాడు. బ్రాహ్మణార్థాలకు, దానాలకు, శవ వాహకత్వాలకు వెళ్ళి, వచ్చేప్పుడు పండో, ఫలమో, కలకండ పలుకో, అరటికాయో, కొబ్బరి ముక్కో తెచ్చి ముందు వాడికి పెట్టేవాడు.

"అక్కమాంబా, వీడికి వైదికం వద్దు. ఇంగ్లీషు చదివిద్దాం. ఏ ఆఫీసులోనన్నా ఉద్యోగం వస్తే, మన శేష జీవితం హాయిగా గడచిపోతుంది" అని మార్కండేయులు ఆశపడుతుండేవాడు.

పుట్టిన అర్భకపు ప్రాణి గాలికీ, ధూళికీ పెరిగి, ఎప్పుడూ ఈసురోమంటూ ఉండేవాడు. జ్వరాలు, కోరింత దగ్గు, చిన్నబిడ్డ చేష్టలు, గవదబిళ్ళలు, మలేరియా - ఇలా ఆ కుర్ర వెధవకు రాని జబ్బు లేదు. అయినా, ఆ కుర్రాడు బతికాడు. అదే విచిత్రం.

అక్కమ్మకు కొడుకు జ్ఞాపకం రావడం కొత్తేమీ కాదు. ఒంటరిగా ఉన్నప్పుడు కొడుకు జ్ఞాపకం వస్తాడు. కానీ, ఈ సీమపందిలాంటి కుర్రాడిని చూస్తున్న దగ్గర్నుంచీ ఆ జ్ఞాపకాలు మరీ తేనెతుట్టెలాగా ముసురుకోసాగాయి.

ఆ సీమపంది పేరు - మార్కండేయులు.

ఈ మార్కండేయులు తినడం - అదీ ఆబగా, మళ్ళీ తిండి దొరకదేమో అన్నట్లు తినడం చూస్తే అక్కమ్మకు కొడుకే గుర్తుకొచ్చాడు.


అక్కమ్మ కొడుకు చూడడానికి నరికెళ్ళ పాములా పీలగా ఉన్నా, ఏదన్నా పెడితే, గబుక్కున మింగేసేవాడు. ఎంత తిన్నా వాడి మొహంలో తిన్నానన్న తృప్తి ఉండేదిగాదు. ఇంకా కావాలన్న కోరికే ఉండేది. వాడి చూపులు డేగ చూపుల్లా ఉండేవి. తినే పదార్థం కంటబడితే మెరుపులా లాక్కుని తినేసేవాడు, బల్లిలా.

అక్కమ్మ భర్తకు ఐశ్వర్యం లేదు, దరిద్రం తప్ప. ఆశ లేదు, తృప్తి తప్ప. ఉన్నది, సంపాదించుకున్నది తిని, హాయిగా నెత్తిన తుండు కప్పుకుని, ఆదమరచి నిద్ర పొయ్యేవాడు. రేపటి గురించి దిగులు పడేవాడు కాదు.

ఇంత నిరామయంగా ఉండే భర్తను, ఆకలి, అనారోగ్యంతో పెరుగుతున్న కొడుకును చూసి అక్కమ్మ తనదీ ఓ బతుకేనా? తాము మనుషుల్లా బతుకుతున్నామా అని ఒక్కోసారి ఆశ్చర్యపొయ్యేది.

సూర్యంబాబు వచ్చిన మార్కండేయులు గురించి వీలు చిక్కినప్పుడల్లా వివరాలు చెప్పేవాడు. విశేషాలు చెబుతుండేవాడు.

"అమ్మా, నీవు చేసిన పెరుగుపచ్చడి, ఆహాఁ, మార్కండేయులు ఎంతగా మెచ్చుకున్నాడో.



తనకు కొత్త చూపు వస్తుంది. మనకగా కనిపించే ప్రకృతి, మనుషులు, వస్తువులు అన్నీ స్పష్టంగా కనబడతాయి.

చిత్రాలు: నర్సిం

'అంకుల్ ఈ పూర్ణపు బూరెలు తమాషాగా ఉన్నాయే. అరిశెలు ఎన్ని తిన్నా తనివి తీరడంలేదు.' అంతే కాదమ్మా. పుట్టి, పెరిగింది అమెరికాలో గదా. మన వంటకాలు ఏమీ తినలేదేమో, వాడికన్నీ వింతగానూ, ఆశ్చర్యంగానూ ఉన్నాయి. పనసపొట్టు కూర, పట్టి కూర తినేశాడమ్మా."

మరోసారి ఇంటికొస్తూనే సూర్యంబాబు వంటగదిలోకొచ్చి, "అమ్మా, మార్కండేయులు, అమరలింగేశ్వరస్వామి ఆలయం చూసి, ఆ గోపురాలు, ప్రాకారాలు, పక్కనే ప్రవహించే కృష్ణవేణమ్మ, దూరంగా లంకలు, ఆ పక్కనే ఉన్న కొండలూ చూసి, 'అంకుల్! అమెరికాలో డబ్బుంది. సుఖాలున్నాయి. కానీ, ఇంత ప్రశాంతత, జీవితంలో మాధుర్యం లేవు అంకుల్. అక్కమ్మగారి చేతి వంట తిని, ఎగిరే పక్షుల్నీ, చీమల్లా సాగే పడవల్నీ చూస్తూ బతకడం ఓ వరం' అన్నాడమ్మా" అని చెబితే అక్కమ్మ ఏం మాట్లాడలేదు.

ఈ మార్కండేయులుకు తెలుగు రాదు. అర్థం చేసుకోగలడు. కళ్ళింతగా చేసుకుని అన్నీ విచిత్రంగా చూడడం అక్కమ్మ గమనించింది.

ఓ రోజు వంట గదిలోకొచ్చి, అక్కమ్మ కూరలు తరగడం, పచ్చడి రుబ్బడం చూశాడు. రోలు, రోకలి గురించి సూర్యంబాబు పిల్లల్ని అడిగి తెలుసుకున్నాడు.

సూర్యంబాబు, అక్కమ్మను పిల్చి అడిగాడు, "మీది వైకుంఠపురం దగ్గర పేరూరు గదా. అక్కడికెడుతున్నాం మార్కండేయులు, నేను. మీరొస్తారా?"

"అక్కడ ఏవుంది బాబూ నాకు."

"మీ ఊరు గదా."

"అంతే. ఆయన, నేనూ బతుకు గడవక ఇక్కడికొచ్చాం."

"అక్కడ మీకేం లేవా? ఇల్లు..."

"ఏం లేవు."

ఆ చర్చ అంతటితోనే ముగిసినా, అక్కమ్మ ఆలోచన ఆగలేదు.

ఈ పిల్లవాడికి పేరూరులో ఏం పని? ఏం చూసేందుకు వెడుతున్నాడు? ఎవరున్నారు అక్కడ?

అక్కమ్మ పదేళ్ళ వయసులో పేరూరు వచ్చింది. ఆ రోజుల్లో ఆడపిల్లల్ని కొనుక్కొచ్చి వివాహమాడడం ఆనవాయితీ. పాలఘాట్ ప్రాంతంలోని పల్లెటూరు నుంచి తల్లిదండ్రులు అప్పగించగా, ముక్కూ మొహం తెలియనివాళ్ళ వెంట దిగులుగా, బాధ, ఏడుపు కడుపులో దిగమింగుకుని వచ్చేసింది అక్కమ్మ.

మట్టిమిద్దె ఇల్లు - కుండలు. పాత ట్రంకుపెట్టె. చిలుముపట్టిన గిన్నెలు. పైకప్పుకు వేలాడుతున్న బూజు - ఉట్లు, బల్లులు, ఎలుకలు.

మర్రోజు ఊళ్ళో ఆడంగులు వచ్చి, అక్కమ్మను చూశారు, పలకరించారు. వాళ్ళు అడిగేది అక్కమ్మకు తెలియదు. ఏం చెప్పాలన్నా తనకూ తెలియని అయోమయం.

వేణుగోపాలస్వామి ఆలయంలో పెళ్ళి జరిగింది. అప్పుడు చూసింది భర్త మార్కండేయులును. బట్టతల, ఇంత లావు పొట్ట, ఒళ్ళంతా వెంట్రుకలు.

మనసులోని మాట, బాధ, అనుభూతి చెప్పుకునేందుకు, భాష రాదు. కన్నవారు, తోడబుట్టినవాళ్ళు లేరు. స్నేహితులు లేరు. ఒంటరి బతుకు. ముసలి అత్తగారు. ఆవిడకు మడీ, ఆచారం. పైగా నణుగుడు.

ఏది ముట్టుకోవచ్చో, ఏ పని చెయ్యాలో, చెయ్యగూడదో, అకలైతే ఏం తినాలో కూడా తెలియదు అక్కమ్మకు. తల్లీ, తండ్రీ, తోడబుట్టిన వాళ్ళు, స్నేహితులు, పరిసరాలు అన్నీ జ్ఞాపకం వచ్చేవి. దుఃఖం వచ్చేది. లోలోపలే ఏడ్చేది- రోజులతరబడి.

క్రమక్రమంగా కొత్త పరిసరాలకు, వాతావరణానికి అలవాటై, కొంచెం కొంచెం భాష నేర్చుకునేసరికి, రెండు సార్లు గర్భం వచ్చి పోయింది. జబ్బు. దిగులు. సరైన తిండి, ఆదరణ, ఆప్యాయత లేని ఎడారి జీవితం. మంచి బట్టకూ, తిండికీ నోచని బతుకు.

చెరువుకు వెళ్ళి, నీళ్ళు తేవడం, మట్టి మిద్దెంతా రోజూ పేడతో అలకడం, ముగ్గులెయ్యడం, చాదస్తపు అత్తగారికి పనిలో సాయపడడం - ఇదీ అక్కమ్మ జీవితం.

అక్కమ్మ భర్త, మార్కండేయులు తల్లి కంట పడకుండా పడగ్గదిలో భార్యకు జీళ్ళు, మరమరాల ఉండలు, చెరకు ముక్కలు, తేగలు తెచ్చి పెడుతుండేవాడు.

శివరాత్రికి ఏ శివక్షేత్రానికో తీసుకుపోయి, కిళ్ళీ ఇప్పించేవాడు. ఓసారి సినిమా కూడా చూపించాడు.

అవన్నీ గుర్తుకొచ్చి, అక్కమ్మ మనసు పులకరించిపోయింది.

ఆ రోజుల్లో డబ్బు లేదు. ఒక్క భర్త అనురాగంతో అక్కమ్మ బతకగలిగింది. కొడుకు చదువుకునే ఈడు వచ్చేసరికి, ఉన్న ఊళ్ళో బతకడం కష్టమై, కొడుక్కు చదువు చెప్పించాలన్న తాపత్రయంతో, ఊరొదిలి వచ్చేశారు, అత్తగారు కాలం చేశాక.

ఇప్పుడు ఇన్నేళ్ళకు, ఈ మార్కండేయులు ఆ ఊరెందుకు వెడుతున్నాడో. అక్కమ్మకు అర్థం కాలేదు.

అక్కడేముంది. దరిద్రం. అజ్ఞానం. మూడాచారాలు. పట్టింపులు. నిత్యం బతుకుతెరువు కోసం ఆరాటం, వెతకులాట.

ఊరొదిలినా, అక్కమ్మ జీవితం మారలేదు. కలిగిన వారింట వంటలు చేయడం, నోములు, వ్రతాలకు వెళ్ళి ముత్తైదు తాంబూలాలు అందుకోవడం, వాయనాలు స్వీకరించడం.

మార్కండేయులు తద్దినాలకూ, దానాలకూ వెళ్ళడం. అవీ లేనప్పుడు యాయవారం. గుళ్ళల్లో ప్రసాదాలు తిని ఆనందించడం.

రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు

కాలచక్రంలో గడుస్తూనే ఉన్నాయి.

మార్కండేయులు కృష్ణకు స్నానానికి వెళ్ళి, కాలు జారిపడి, కాలు విరిగి మంచమెక్కాడు. ఆ మంచం మరి దిగలేదు. తీసుకుని తీసుకుని 'హరీ' అన్నాడు.

అప్పటికి కొడుకు శంకరం మిలట్రీలో ఉన్నాడు. ఎక్కడున్నాడో తెలియదు. తెలిసిన చోటకు ఉత్తరాలు రాస్తే, జవాబు రాలేదు. ఉత్తరాలు తిరిగొచ్చాయి. మార్కండేయులు అనాథ ప్రేతంగానే మట్టిలో కలిశాడు. ఉత్తరక్రియలు లేవు. కర్మకాండ అనలే లేదు. అక్కమ్మకు చేతిలో డబ్బు లేదు. అయ్యో అని ఆదుకునేవారూ లేరు, ఓదార్చేవారూ లేరు.

తండ్రి పోయిన ఆర్నెల్లకు శంకరం వచ్చాడు. అర్భకత్వం పోయి నున్నగా, నల్లగా చేవ తేలి మద్ది మానులా అయ్యాడు. తల్లిని చూసి జాలిపడలేదు. తండ్రి పోయినందుకు విచారించనూ లేదు. ఉన్న రెండు రోజులూ ఖైదులో ఉన్నట్లు మొహం పెట్టి వెళ్ళిపొయ్యాడు.

అక్కమ్మ ఎన్నో చెప్పాలనుకుంది. కొడుకు వాలకం చూసి ఏమీ చెప్పలేకపోయింది. తనను తీసుకపోతాడని, వచ్చి దగ్గరుండమంటాడనీ ఆశించింది. పెళ్ళి చేసుకుంటాడేమోనని ఉవ్విళ్ళూరింది.

అబ్బే. శంకరం ఏమీ చెప్పలేదు. కనీసం 'అమ్మా, ఎలా ఉన్నావ్? ఏం తింటున్నావ్' అని కూడా అడగలేదు.


అక్కమ్మ ఏమీ అనలేదు. కొడుకు బాగుంటే చాలు. వాడు ఈ దరిద్రంలోంచి బయట పడి, ఓ ఇంటివాడై, పిల్లాపాపలతో సుఖంగా ఉంటే చాలని కోరుకుంది.

అక్కమాంబా, ఎక్కడ పుట్టావో. ఊహ తెలియని వయసులో నాకు భార్యవైనావు. నిన్ను ఏం సుఖపెట్టానో నాకు తెలియదు. నాకెన్నో కోరికలు ఉండేవి. నీకు సొమ్ములు చేయించాలని, కనీసం నీకో పట్టుచీర కొనిపెట్టాలని ఉండేది. ఏవీ తీర్చలేకపోయా. కనీసం ఓసారి నిన్ను తీసుకవెళ్ళి, నీ పుట్టింటివాళ్ళకు చూపిద్దామని కలలు కన్నా. ఏం చెయ్యలేని అసమర్థుడిగా తయారయ్యా.

అక్కమ్మా, నీ కొడుకన్నా, నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడులే. నే పొయ్యేలోగా వాడొస్తే, 'ఒరేయ్ శంకరం, నాన్నా, మీ అమ్మను జాగ్రత్తగా చూసుకోరా. జీవితాంతం ఓ సుఖం, సౌఖ్యం లేకుండా బతికిందిరా. ఏ రోజూ నాకిది లేదు, నాకిది కావాలని అడగలేదురా. బాబూ, మీ అమ్మను ప్రాణప్రదంగా చూసుకో. దాని శేషజీవితం హాయిగా ఆనందంగా గడిపేలా చూడరా' అని చెబుదామనుకున్నా. ఏదీ వాడి జాడ లేదు" అని మార్కండేయులు మంచంలో ఉన్నన్నాళ్ళూ కలవరించాడు.

కానీ, శంకరం రాలేదు.

వస్తాడని కొన్నాళ్ళు ఎదురు చూసి, రాడని నిశ్చయించుకుని, అక్కమ్మ దేవుడిపై భారం వేసి బతకసాగింది.



కొడుకు సుఖంగా ఉన్నాడు. చాలు తనకు ఇంకేం కావాలి.

అదిగో అప్పుడు సూర్యంబాబు ఈ ఊరొచ్చి కాపురం పెట్టాడు.

"అమ్మా. నేను ఉద్యోగరీత్యా దేశమంతా తిరిగా. చిన్నా, పెద్దా ఉద్యోగాలు చేశా. డబ్బు, పరపతి సంపాయించా. పిల్లలు పెరిగి ప్రయోజకులై తలా ఒకచోట ఉన్నారు. కూతుళ్ళు, అల్లుళ్ళు క్షేమంగా ఉన్నారు. నేను, మా అవిడ, ఇప్పుడిప్పుడు వచ్చే పిల్లలు, మనుమలు, మనుమరాండ్రు- ఇదీ నా కుటుంబం.

నీకే ఆధరువూ లేదని, వంట బాగా చేస్తావనీ చెప్పారు. చూడమ్మా, మాకింత వండిపెట్టు, నువ్వింత తిను. నీకు మేము, మాకు నువ్వు ఏం?"

సూర్యంబాబు చెప్పిందంతా విని అక్కమ్మ, "అలాగే బాబుగారూ" అంది.

ఇదంతా గుర్తుకొచ్చి అక్కమ్మ, ఈ ఆధారం లేకపోతే తాను ఏమయ్యేది? ఏమో? ఊహించుకోలేకపోయింది. కల కన్నది. ఆ కలలో సూర్యంబాబు ఊరు నుంచి నరానరి అక్కమ్మ దగ్గరకొచ్చి, "అమ్మా, నిజం చెప్పు. నువ్వు శంకరం తల్లివా" అనడిగాడు.

అక్కమ్మ మాట్లాడలేదు.

"వాడికో తల్లి ఉందని, ఇలా వంట చేసుకు బతుకుతోందని వాడు చెప్పలేదు. నువ్వు ఏనాడూ కొడుకు గురించి చెప్పనూ లేదు. అమ్మా, నువ్విలా ఊడిగం చేసి బతుకుతుంటే, వాడు అక్కడ భోగ భాగ్యాలు అనుభవిస్తూ ఉండడం! ఛీ ఛీ, ఎంత అమానుషం. వాడింత నీచుడు, నికృష్టుడు అనుకోలేదమ్మా!"

ఆ రోజంతా సూర్యంబాబు అదోలాగా ఉన్నాడు. అక్కమ్మను నిశితంగా పరిశీలిస్తూనే ఉన్నాడు.

ఆ సాయంత్రం మార్కండేయులు వచ్చి అక్కమ్మకు నమస్కరిస్తే, అక్కమ్మ అవాక్కయింది, తొట్రుపడింది.

"నాకెందుకూ" అంది గువ్వలా వణికిపోతూ, దూరంగా జరిగి.

"వీడు నీ మనవడమ్మా! మీ ఊరు వెళ్ళి వీడి తాతగారు పుట్టిన ప్రదేశం చూసి వస్తుంటే ఊరివాళ్ళు చెప్పారు నువ్వు దిక్కులేని అనాథలా ఇక్కడున్నావని. నాకు అప్పటి నుంచి మనసు మనసులో లేదమ్మా. కన్నతల్లి గర్భ దారిద్ర్యం అనుభవిస్తూ దిక్కు లేకుండా ఉంటే, వాడు అక్కడ ఏమీ పట్టనట్లు, ఎవ్వరూ తనకు ఈ దేశంలో లేనట్లు ఉండడం, పూచిన పువ్వు, కాచిన కాయ తల్లి వేరును మర్చిపోవడం లాంటిదే." సూర్యంబాబు చాలా ఆవేశంగా అన్నాడు.

మార్కండేయులు సగం అర్థమై, సగం కాక చూస్తూ నిలబడ్డాడు.

"వీడు వెడుతున్నాడుగా. వీడిచేత కబురంపుతాను. త్రాష్టుడా! తల్లిని మర్చిపోయిన నీవు మనిషివి కాదురా! రారా. ఓసారి వచ్చి తల్లిని చూడరా! ఆమెను సుఖపెట్టరాని!"

"వద్దు బాబూ." అక్కమ్మ దృఢంగా చెప్పింది.

"ఏం?"

"తర్వాత చెబుతాను బాబూ. వీడు నా మనవడన్నారు సంతోషం. వీణ్ణి చూశా చాలు. చాలా ఆనందంగా ఉంది. ఎక్కడున్నా నా కొడుకు సుఖంగా ఉంటే అదే చాలు. బాబూ, మనవడు కంటబడితే ఏమీ ఇచ్చుకోలేని దరిద్రురాలను. ఓ అయిదు వందలు నా కన్ను ఆపరేషనుకు దాచుకున్న డబ్బులోంచి వాడికివ్వండి. మీ బామ్మ ఇచ్చింది. ఏమన్నా కొనుక్కోమనండి."

అక్కమ్మ వెళ్ళిపోయింది అక్కడ నుంచి.

నరానరి ఇంటికొచ్చి, మంచం మీద వాలిపోయింది.

ఉద్వేగం, మధురానుభూతులు పొంగిరాగా, తన కొడుకు సుఖంగా ఉన్నాడు, భోగభాగ్యాలతో తుల తూగుతున్నాడు. అంతేకాదు, మనవడికి తాతగారి పేరెట్టుకున్నాడు. తాను రాలేకపోయినా మాతృదేశానికి, అందునా పుట్టిన ఊరు చూసిరమ్మని కొడుకుని పంపాడు. చాలు తనకేం కావాలి. తన వంశం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లింది.

అక్కమ్మ మనసు ఆనందంతో ఉప్పొంగిపోయింది. రంగురంగుల కలలు కంటూనే ఉంది.

సూర్యంబాబుని ఒక్క కోరిక కోరాలి.

'బాబూ. నాకేం కోరికలూ లేవు. మీరు తీర్చగలిగితే- ఒక్కటే- నా అంత్యక్రియలకు నా కొడుకుని రప్పించండి. అంతే నా కోరిక బాబూ' అని చెప్పాలనుకుంది.

ఆ నిశ్చయానికొచ్చాక ఆమె మనసు కుదుటపడింది.

ఆమెలో నూతనోత్సాహం వచ్చింది.

కలల అలలపై తేలియాడుతూ, వీధి అరుగు మీద, సాయంత్రపు నీరెండను చూస్తూ గత, వర్తమాన, భవిష్యత్తుల మధ్య ఆనందంతో ఆమె మనసు ఊయలలా ఊగుతున్నది. ■